## క్లుప్తంగా

### సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

● ఎంపీడీఓ భవానీ



కేజీబీఈ హాస్టల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

దెంకాడ: గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.భవానీ అన్నారు. మండలంలోని కొండరాజుపేటలో గురువారం అధికారులు పర్యటించి, కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాలు, భోజన సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరగడ కవిత, ఎంఈఓ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం మిల్లుల పరిశీలన



పేరాపురంలో ధాన్యం మిల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ గోవింద

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం ధాన్యం మిల్లును తహసీల్దార్ తాడ్డి గోవింద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు మిల్లుకు పంపిస్తున్న ధాన్యం తూకాన్ని సక్రమంగా చూసుకుని పారదర్శకంగా తరలించాలని సూచించారు. రైతులకు సంతృప్తికరంగా ఉండేవిధంగా సేవలు అందించాలన్నారు. ఆయనతో పాటు సర్వేయర్ గణపతిరావు, తదితరులున్నారు.

### బాల్య వివాహాలపై విస్తృత ప్రచారం..



మాట్లాడుతున్న ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలపై విస్తృత ప్రచారం చేపడుతున్నామని యూత్ క్లబ్ బెజ్జిపురం ఎస్‌జీఓ డైరెక్టర్ ఎం. ప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అవగాహన లేకపోవడం వల్లే బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లయితే ట్రోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల మాతా,శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. సమావేశంలో సీడీపీఓ జి. ప్రసన్న, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

### వచ్చే నెల 3న వాసవీ క్లబ్ రజతోత్సవం



రజతోత్సవాల ఆహ్వాన ప్రతులను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న తరుణంలో వచ్చే నెల 3న రజతోత్సవాలు నిర్వహించనున్నట్లు క్లబ్ వైస్ గవర్నర్ ఆలవెల్లి శేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక క్లబ్ కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. సమావేశంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చెన్నాబుచ్చి జనార్దనరావు, కార్యదర్శి కె. రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయకుమార్, విన్నకోట రమేష్‌కుమార్, గుంపిన నారాయణరావు, ప్రాజెక్ట్ చైర్మన్ బొడ్డు పండు, పెదబాబు, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, చిట్టూరి మురళీకృష, డిమ్స్ రాజు, సముద్రాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### భోజనంలో నాణ్యతో లోపిస్తే చర్యలు

● ప్రత్యేకాధికారి అరుణకుమారి



ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అరుణ, తదితరులు

విజయనగరం రూరల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి అన్నారు. మండలంలోని మలిచెర్లలో గురువారం నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయం, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ.. పాఠశాల, సచివాలయం, అంగన్‌వాడీ, తదితర శాఖల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. సందర్శనలో ఆమెతో పాటు ఎంపీడీఓ తిరుపతిరావు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కందివలస గెడ్డ కలుషితం..

● పరిశ్రమ వ్యర్థాలతో కలసి ప్రవహిస్తున్న జలాలు
● తాగునీటికి ఇబ్బంది పడుతున్న గెడ్డ పరిసర గ్రామాల ప్రజలు
● గెడ్డలో నీరు తాగి మృత్యువాత పడుతున్న పశువులు, జంతువులు



తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని చెబుతున్న కొణతాలపాలెం మహిళలు (ఫైల్)



కలుషితమైన కందివలస గెడ్డ

పూసపాటిరేగ: నిత్యం స్వచ్ఛమైన తాగునీటితో కళకళలాడుతూ ప్రవహించే కందివలస గెడ్డ పరిశ్రమల వ్యర్థాలతో రూపం కోల్పోయింది. గెడ్డ నీరు మొత్తం కలుషితం కావడంతో పరిసర గ్రామాల్లోని బోరుబావులు, నూతుల్లోని నీరు పూర్తిగా తాగడానికి పనికిరాకుండా పోయింది. దీంతో సుమారు పది గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. అలాగే మూగజీవాలు, పశువులు గెడ్డ నీరు తాగి మృత్యువాత పడుతున్నాయి. విజయనగరం జిల్లా సరిహద్దులలో ప్రవహిస్తున్న కందివలస గెడ్డను ఆనుకుని పూసపాటిరేగ మండలంలోని పలు గ్రామాలున్నాయి. వాటిలో అల్లాడపాలెం, చౌడువాడ, కోనయ్యపాలెం, కొణతాలపాలెం, కనిమెల్ల, కామవరం, చింతపల్లి, నీలగెడ్డపేట, లంకలపల్లిపాలెం, తదితర గ్రామాల్లో తాగునీటి వనరులు పూర్తిగా కలుషితమయ్యాయి. తాగునీటి జలాలు కలుషితమైనప్పటికీ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారుల జాడే లేదు.

**సమీపంలోనే పరిశ్రమలు**

పూసపాటిరేగకు ఆనుకుని కందివలస గెడ్డ సమీపంలో వివిధ పరిశ్రమాలున్నాయి. ఆయా పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను రాత్రి సమయాల్లో గెడ్డలోకి వదిలేస్తున్నారు. వాస్తవానికి వ్యర్థాలను పరిశ్రమల వారే రీయూజ్ చేసుకునేలా చర్యలు చేపట్టాల్సి ఉన్నా, ఆ దిశగా యాజమాన్యాలు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. తాజాగా కొణతాలపాలెం సమీపంలో నెల్లిమర్ల నియోజకవర్గ శాసనసభ్యురాలు లోకం నాగమాధవితో పాటు పలువురు అధికారులు గెడ్డను పరిశీలించగా..గెడ్డలోని నీరు నల్లగా ఉండడంతో పాటు ఎన్నో వ్యర్థాలను గుర్తించారు. అదే సమయంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలు వచ్చి గెడ్డ నీరు కలుషితం కావడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూగర్భజలాలు కలుషితమవుతున్నా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సరిహద్దులో గెడ్డ ఉండడంతో అటు శ్రీకాకుళం, ఇటు విజయనగరం అధికారులు నిర్లక్ష్యధోరణి కనబరుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కందివలస గెడ్డను కాలుష్య కోరల నుంచి రక్షించాలని పది గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**చర్యలు తీసుకోవాలి**



గెడ్డలో వ్యర్థ జలాలను పరిశీలించి పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలుష్యం కోరలు చాస్తున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారుల జాడ లేదు. పరిశ్రమలు శ్రీకాకుళం జిల్లా సరిహద్దులలోను.. కాలుష్యం విజయనగరం జిల్లాలోని గ్రామాలులోకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొణతాలపాలెం గ్రామం కాలుష్యంతో నిండిపోయింది. తాగేందుకు మంచినీరు దొరకని పరిస్థితి నెలకొంది.

– కొణతాల లక్ష్మి, కొణతాలపాలెం గ్రామం

**ఇబ్బంది పడుతున్నాం**



కందివలస గెడ్డ కలుషితం కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. గెడ్డలో నీరు తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయి. సమీపంలోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు గెడ్డలో కలుస్తున్నాయి. భూగర్భ జలాలు కలుషితం కావడంతో బోర్లు, నూతుల్లోనీ నీరు కలుషితమైంది.

– కొణతాల రాములమ్మ, కొణతాలపాలెం గ్రామం

## 16వ డివిజన్‌లో వార్డు పర్యటన



వార్డు పర్యటనలో సమస్యలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్లు

విజయనగరం: పట్టణంలోని 16వ డివిజన్‌లో కార్పొరేషన్ అధికారులు వార్డు పర్యటనలో భాగంగా గురువారం పర్యటించి, స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, బోర్‌వెల్ చుట్టూ చప్టా ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు మాట్లాడుతూ, అంబటి సత్రం నుంచి కొత్తపేట వెళ్లే రహదారిలో ప్రధాన కాలువకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అలాగే కొణిశి వీధికి వెళ్లే రహదారిలో ప్రధాన కాలువను కప్పేసి సోఫాల తయారీకై అవసరమైన సామగ్రి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు మాట్లాడుతూ.. అధికారులు తమ డివిజన్‌లోని పర్యటించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తీరప్రాంత గ్రామాలలో నిఘా కెమేరాలు



పూసపాటిరేగ: మాట్లాడుతున్న ఎస్సై దుర్గాప్రసాద్, తదితరులు

పూసపాటిరేగ: తీరప్రాంత గ్రామాలలో నిఘా కెమేరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. కృష్ణాపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కెమేరాను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోనయ్యపాలెం జంక్షన్‌తో పాటు పలు గ్రామాలలో కెమేరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేరాలకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడానికి కూడా ఈ కెమేరాలు దోహదపడతాయన్నారు.



నెల్లిమర్ల: రామతీర్థం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు

**నెల్లిమర్లలో..**

నెల్లిమర్ల: పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిలో నేరాల నియంత్రణ కోసం కెమేరాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎస్సై బి. గణేష్ తెలిపారు. మున్సిపల్ అధికారుల సహకారంతో త్వరలో ఫ్లడ్‌లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

## త్వరితగతిన రీసర్వే

● కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అర్బన్ రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి అడ్మిన్ కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్వేలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించుకుని అడ్మిన్, ప్రణాళికా కార్యదర్శులు, సిబ్బంది సమన్వయంతో సర్వే పూర్తి చేయాలన్నారు. శనివారం నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ప్లానింగ్ బౌండరీలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. అలాగే పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. కుళాయి పన్నులను చెల్లించని వారి కనెక్షన్లు వెంటనే తొలగించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, సర్వేయర్ సింహాచలం, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నూతన విధానంలో భవన నిర్మాణానికి అనుమతులు

● కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: మురికివాడలు, ఇరుకు రహదారుల్లో భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు వెడల్పు సడలింపు విధానం ద్వారా అనుమతులు తీసుకోవాలని నగర ప్రజలకు కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది, కార్యదర్శులకు రోడ్డు వెడల్పు సడలింపు విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రోడ్డు వెడల్పు సడలింపులో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఒక ప్లాన్ తయారు చేయాలని సూచించారు. ఈ ప్లాన్‌ను కౌన్సిల్ ముందు ఉంచితే రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఫర్ టౌన్ ప్లానింగ్ వారి అనుమతి పొందిన తర్వాత సదరు ప్రాంతాలలో భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఇతర పట్టణ ప్రణాళిక కార్యకలాపాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దెంకాడ/భోగాపురం: విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా రాజాపులోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మోదవలస, గొండయ్యపాలెం, జరజాపు కల్లాలు, బంగారాజుపేట, కొండరాజుపేట, చినవల్లూరు, పెదవల్లూరు, మోపాడతో పాటు... భోగాపురం మండలంలోని పోలిపల్లి, మహరాజుపేట, రాజాపులోవ, చెరువకుపల్లి గ్రామాలకు సరఫరా ఉండదని పేర్కొన్నా రు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**విజయనగరంలో..**

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని బొగ్గులదిబ్బ ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పెద్దింటి త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పోలయ్యపేట, ఎల్‌బీ కాలనీ, వివేకానంద కాలనీ, మారుతీనగర్, బొగ్గులదిబ్బ, అలకానంద కాలనీ, ఆర్‌అండ్‌బీ జంక్షన్, కంటోన్మెంట్ ఏరియా, సీబీ కాలనీ, తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రకాశరావు



పడాల చంద్రశేఖర్

భోగాపురం: యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె. ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా పి. ప్రకాశరావు, మండల అధ్యక్షుడిగా పడాల చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌లుగా టి. పద్మ, పి. వాసుదేవరావు, జనరల్ సెక్రటరీగా పి. నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా కె. శ్రీనివాసరావు బెహరా, సబ్ కమిటీ కన్వీనర్‌గా కె. శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వీరితో పాటు 9 మంది జిల్లా సెక్రటరీలుగా, 16 మంది మండల సెక్రటరీలుగా ఎన్నికయ్యారు.

### స్కూటరెక్కిన రాజు..



కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు గురువారం తన నివాసంలో ఎలక్ట్రిక్ స్కూటర్ నడిపారు. పర్యావరణానికి మేలు చేసే ఇటువంటి వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. కేంద్ర మాజీ మంత్రి స్కూటర్ నడపడాన్ని అందరూ ఆశ్చర్యంగా చూశారు.

– విజయనగరం రూరల్

### అప్రమత్తంగా ఉండాలి..



రెల్లరాల్చు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కె. నీలమ అన్నారు. మండలంలోని ఎరుకొండలో గురువారం పర్యటించి వరి పొలాలను పరిశీలించి, రెల్లరాల్చు పురుగు ఉధృతిని గమనించారు. కోతకు పది రోజుల సమయం ఉండడంతో ఎమక్టిన్‌బెంజోట్‌ను ఎకరానికి 80 గ్రాముల చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తుఫాన్ కారణంగా ఈ నెల 30 వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఆమెతో పాటు పలువురు రైతులున్నారు.

– పూసపాటిరేగ

### ఉత్సవాలకు ఏర్పాట్లు..



నగరంలోని సిటీ బస్టాండ్ వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయంలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ప్రధానార్చకుడు వీకే గాయత్రీశర్మ అన్నారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు, భక్తులతో కలసి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిసెంబర్ 2 నుంచి 30 వరకు ప్రతి గురువారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు చేపడతామన్నారు. డిసెంబరు 7న సుబ్రహ్మణ్య షష్ఠి.. 13న హనుమత్ వ్రతం. 14న అమ్మవారికి సారె సమర్పణ, భారీ ఊరేగింపు ఉటుందన్నారు. 30న ఆలయ ఆవరణలో పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణలు ఉంటాయన్నారు.

విజయనగరం టౌన్

## దళారులను నివారించేందుకే..

● ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించన ఎమ్మెల్యే అదితి



పినవేమలిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: దళారులను నివారించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు అన్నారు. మండలంలోని పినవేమలి, రాకోడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనగోలు కేంద్రాలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే ధాన్యం తరలించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి లత, స్థానిక నాయకులు వేసలపు శ్రీను, నగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు బొద్దల నరసింగరావు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి..



కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తూ మరణించిన తుపాకుల రమణమ్మ, బొమ్మాలి వెంకట్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని సహచర ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కమిషనర్ కె. అప్పలరాజును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎ.జగన్‌మోహనరావు, యూనియన్ కార్యదర్శి బాబూరావు, నాయకులు పైడిరాజు, రాము, రాజు, గౌరీ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి చట్టాన్ని నీరుగారుస్తున్నారు..

● లోకల్ గవర్నమెంట్స్ జాతీయ అధ్యక్షుడు మామిడి



మాట్లాడుతున్న మామిడి, తదితరులు

విజయనగరం రూరల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని ఏపీ కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ఆరోపించారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ యాక్ట్ 2005 ప్రకారం గ్రామ అవసరాలకు ఉపయోగపడే పనులను గ్రామసభల్లో నిర్ణయించాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా చేపడుతున్నారన్నారు. అధికార కూటమి పార్టీకి చెందిన వ్యక్తులే వెండర్లుగా అవతారం ఎత్తి మోసాలకు పాల్పడుతన్నారని తెలిపారు. వారికి సంబంధిత అధికారులు కూడా వత్తాసు పలుకుతూ అండగా నిలుస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉపాధిహామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుంటే భవిష్యత్‌లో న్యాయపోరాటం చేయక తప్పదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల త్రినాథ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపనకు కృషి చేయాలి..



విజయనగరం పూల్‌బాగ్: జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

● నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు షణ్ముకరావు

విజయనగరం పూల్‌బాగ్: సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు పి. షణ్ముకరావు అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయం ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అభ్యుదయ రచయితల సంఘ కార్యదర్శి రత్నాల బాలకృష్ణ మాట్లాడుతూ.. కులమత భేదాలు లేని, దోపిడీ పీడనలేని సమసమాజ స్థాపనకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా విజయం పార్టీ కార్యదర్శి సీహెచ్ బంగార్రాజు, నాయీ బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు టీవీ దుర్గారావు, శాతవాహన సంఘ జిల్లా అధ్యక్షుడు కె. విశ్వనాథం, గరుగుబిల్లి వినయ్‌బాబు, దళిత హక్కుల పోరాట సమితి కార్యదర్శి గరుగుబిల్లి సంతోష్ పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

**మహనీయుడు పూలే..**

విజయనగరం టౌన్: విద్యావ్యాప్తికి విశేషంగా కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. తెలుగు భాషా సేవా సంఘం ఆధ్వర్యంలో గాజులరేగలో ఉన్న పాఠశాల ఆవరణలో పూలే 134వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.